వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

- ఎల్‌బీనగర్‌లో బంధువుకు ఫోన్ చేసి నిరుద్యోగి..
- ఐఎస్‌సదన్‌లో భర్తతో గొడవపడి భార్య


ఆంజనేయులు

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో చనిపోతున్నానంటూ బంధువుకు ఫోన్ చేసి ఓ నిరుద్యోగి, సంతోష్‌నగర్ ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భర్తతో గొడవపడి భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి.

ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా గుడ్లపల్లి తొక్లాపూర్ గ్రామానికి చెందిన నూనె ఆంజనేయులు (27) 8 నెలల క్రితం పోటీ పరీక్షలకు ప్రిపేర్‌కావడానికని ఎల్‌బీనగర్‌కు వచ్చాడు. గుంటిజంగయ్య కాలనీలో ఓ అద్దె గదిలో స్నేహితుడు ఆకాష్‌తో కలిసి ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేసేవాడు. మూడునెలల క్రితం ఆకాష్ పెళ్లి చేసుకుని వెళ్లిపోగా అతడు ఒంటరిగా ఉండేవాడు. శుక్రవారం అతడు బంధువు అనిల్‌కు ఫోన్ చేసి చనిపోతున్నానంటూ చెప్పాడు. అనిల్ వెంటనే తొక్లాపూర్‌లో ఉండే ఆంజనేయులు సోదరుడైన నూనె అభినందన్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో అభినందన్ ఎల్‌బీనగర్‌లోని అతడి స్నేహితుడు అరవింద్‌ను ఆంజనేయులు గదికి వెళ్లి చూడమని కోరాడు. అరవింద్ అక్కడికి చేరుకునే సమయానికే ఆంజనేయు లు లుంగీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అభినందన్ ఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆర్థిక సమస్యలతో తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడనే ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి..


జ్యోతి(ఫైల్)

సంతోష్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్‌కి చెందిన హన్మంతు, ముడావత్ జ్యోతి(37) భార్యభర్తలు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి సంతోష్‌నగర్‌లోని యాదగిరినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. హన్మంతు ఆటోడ్రైవర్‌గా, జ్యోతి ఇండ్లల్లో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. తరచూ వారి మధ్య గొడవలు జరుగుతుండేవి. శుక్రవారం భర్త ఆటోనడపడానికి వెళ్లిన తర్వాత జ్యోతి మధ్యాహ్నం సమయంలో సీలింగ్‌కి నైలాన్ తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త.. భార్య ఉరివేసుకొని ఉండడం గమనించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. తమ్ముడు రాజేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయాలి :హెచ్‌ఎం

వనస్థలిపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాలత అన్నారు. వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సైన్స్ ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు రకాల నమూనాలు ఆకట్టుకున్నాయి.


లష్కర్‌గూడలో నామినేషన్ సెంటర్ వద్ద డీసీపీ అనురాధ, పోలీసులు

సర్పంచ్ ఎన్నికల నామినేషన్ సెంటర్ల సందర్శన

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ సెంటర్లను శుక్రవారం ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ పోలీసు శాఖ అధికారులతో కలిసి సందర్శించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి మండలంలో నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్, బండరావిరాల, లష్కర్‌గూడ, అనాజ్‌పూర్, బాటసింగారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు నామినేషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ సెంటర్ల వద్ద బందోబస్తుపై పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి, ప్రియాంకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సాయినగర్ కాలనీవాసులు

ఆర్‌సీఐ రోడ్డులో అక్రమ వ్యాపారాలను అడ్డుకోవాలి

సరూర్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తా నుంచి పహాడిషరీఫ్‌లోని శ్రీశైలం హైవే వరకు గల ఆర్‌సీఐ రోడ్డులో అక్రమ వ్యాపారాల కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బాలాపూర్ 18వ డివిజన్‌లోని సాయినగర్ కాలనీవాసులు పోలీసులను కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయినగర్ ఫేజ్-1 అధ్యక్షుడు సంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోడ్డుకు ఇరుపక్కలా అడ్డదిడ్డంగా ఏర్పాటు చేస్తున్న షాపుల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయా అంశాలపై తగిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సభ్యులు జగన్నాథ్, దాసు, సాయికుమార్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం : కొప్పుల


వినాయక్‌నగర్‌లో నాలా పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల

మన్సూరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రతీచోట వరదనీటి నాలాలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చిన్నచెరువులోకి వర్షపు చేరేలా నిర్మిస్తున్న వరదనీటి నాలా పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ వర్షాలతో చిన్నచెరువు నిండితే పరిసరాల్లోని సుమారు 50కాలనీల్లో నీటి సమస్య తలెత్తకుండా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అదేవిధంగా పలు నాలాల్లో వచ్చి చేరిన రాళ్ల, కంకర, వ్యర్థాలను పరిశీలించి వాటిని తొలగించాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

మున్సిపాలిటీల విలీనం.. జిల్లా ఉనికికే ప్రమాదం

బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాను బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం సరికాదన్నారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీల విలీనాన్ని అడ్డుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశమై కార్యచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మల్లేష్, జక్క రాంరెడ్డి, కళ్లెం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సరూర్‌నగర్‌లో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, బేర బాలకిషన్, ఆకుల అరవింద్ తదితరులు


మన్సూరాబాద్‌లో బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి


ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్-3లో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

ఎల్‌బీనగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూలే విగ్రహ వ్యవస్థాపకులు ఆకుల అరవింద్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి,కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ మాజీ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో...

పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద ఘన నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నా రామ్మోహన్‌గౌడ్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు చామకూర రాజు, పూలే యువజన సంఘం అధ్యక్షుడు మేడిగ శ్రీధర్ దర్శీ, తదితరులు ఉన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్: మండల కేంద్రంలో పూలే విగ్రహానికి డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి, ఎల్‌బీనగర్ నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, తదితర నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్‌లోని తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు బ్యాగరి అనంతయ్య పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎల్బీనగర్‌లో పూలే విగ్రహం వద్ద నినదిస్తున్న మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి

ఓల్డ్‌మలక్‌పేటలో...

ఓల్డ్‌మలక్‌పేటలోని పోచమ్మ దేవాలయంవద్ద ఆలయ కమిటీ సభ్యుడు చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు.


ఎల్బీనగర్‌లో బీఎన్‌రెడ్డినగర్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న గౌడ్


నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల జేఏసీ అధ్యక్షుడు అనంతయ్య


హయత్‌నగర్‌లో కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి

మీర్‌పేట్‌లో...

సరూర్‌నగర్: మీర్‌పేట్‌లో 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాదరి సురేఖారమేశ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు నివాళులర్పించారు.

బడంగ్‌పేట్‌లో..

సుబ్రహ్మణ్యం కాలనీలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శివప్రచండ, వల్లపోలు నర్సింహ నివాళులర్పించారు.


మీర్‌పేట్‌లో మాజీ కార్పొరేటర్ సురేఖారమేశ్ తదితరులు

వజ్రాల అన్వేషణలో 'డైమండ్స్' పుస్తకం దోహదం

జీఎస్ఐ కేంద్ర ప్రధాన కార్యాలయ డైరెక్టర్ జనరల్ అసిత్ సహ


డైమండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎస్ఐ కేంద్ర కార్యాలయ డీజీ అసిత్ సహ

మన్సూరాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వజ్రాల అన్వేషణలో 'డైమండ్స్', 'ఫోరామినిఫెరా' పుస్తకాలు దోహదపడతాయని జీఎస్ఐ కేంద్ర కార్యాలయ డైరెక్టర్ జనరల్ అసిత్ సహ అన్నారు. నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ విభాగంలోని క్రిష్ణణ్ ఆడిటోరియంలో శుక్రవారం జీఎస్ఐలోని విశ్రాంత భూగర్భ శాస్త్రవేత్తలు డా॥శ్రీనివాస రావు, ఎస్‌వీ సత్యనారాయణ రచించిన 'డైమండ్స్', ప్రొఫెసర్ పీకే సరస్వతి రచించిన 'ఫోరామినిఫెరా' పుస్తకం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా అసిత్ సహ, నేచురల్ హిస్టరీ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ కేవీ సుబ్బారావు, ఎన్‌జీఆర్ఐ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ వీపీ ధిమిలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసిత్ సహ మాట్లాడుతూ, పుస్తకాలు, పత్రికలు చదవడంలో వచ్చే అనుభూతి మరెక్కడా దొరకదన్నారు. భూగర్భ శాస్త్రవేత్తలకు డైమండ్స్ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందని, దీనిని యువ శాస్త్రవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువైన ఖనిజాలు వెలికితీసి దేశ సంపద సృష్టించడంలో జీఎస్ఐ కీలకంగా వ్యవహరిస్తోందన్నారు. డా.కె.శ్రీనివాసరావు, సత్యనారాయణలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జీఎస్ఐ సంస్థ ఏడీజీ విభాగాధిపతి బసాబ్ ముఖోపాధ్యాయ, డా.ఎస్.రవి, ఎస్‌వీ శివశంకర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


రైతు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి

రైతు సంక్షేమానికి కృషి : జైపాల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి సహకార సంఘం పని చేస్తోందని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. సహకార సంఘం సభ్యుడైనా అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన బుర్ర పెద్ద దాసు గౌడ్ ఆరు నెలల క్రితం మృతి చెందాడు. దీంతో సహకార సంఘం ద్వారా రూ. 25 వేలను రైతు కుటుంబ సభ్యులకు శుక్రవారం జైపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, తొర్పునూరి ప్రభాకర్‌గౌడ్, బుర్ర సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మీర్‌పేట్‌లో కర్ణాటక గాత్ర కచేరీ

సరూర్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని శ్రీ కనకదుర్గ కన్వెన్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 6గంటలకు అమృతవర్షిణి మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నాటక సంగీత గాత్ర కచేరీ నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు ఆకొండి శ్రీనివాస రాజారావుచే నిర్వహించనున్న ఈ కచేరీలో వయోలిన్‌పై విద్వాన్ ఎన్‌సీ అనంత కృష్ణ, మృదంగంపై విద్వాన్ డి.జయకుమారాచార్య ఆయనకు సహకరించనున్నారని నిర్వాహకులు తెలిపారు.


హయత్‌నగర్ కుమ్మరికుంట కట్టపైన ధర్నా చేస్తున్న సామ తిరుమల్ రెడ్డి, తదితరులు

కుమ్మరికుంట కట్టను అభివృద్ధి చేయండి

హయత్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట కట్టను అభివృద్ధి చేయాలంటూ శుక్రవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు కుమ్మరికుంట కట్టపైన రోడ్డు మొత్తం గుంతలమయంగా మారిందన్నారు. దీంతో దాదాపు 20 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హయత్‌నగర్ నుంచి సాహెబ్ నగర్, బీఎన్‌రెడ్డి వెళ్లేందుకు అనువుగా ఉన్న రోడ్డును జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.


ట్రాఫిక్ నిబంధనల రైమ్స్ చూస్తూ డాన్స్ చేస్తున్న చిన్నారులు

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి : ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత కోసం ట్రాఫిక్ రూల్స్ పాటించాలని దాంతో ప్రమాదాలు తగ్గుతాయని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి ప్రీప్రైమరీ స్కూల్ చిన్నారులకు సూచించారు. శుక్రవారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కులో నిబంధనల రైమ్స్ చూస్తూ డాన్స్ చేస్తూ చిన్నారులు సందడి చేశారు. ఇతర ప్రాంతాల్లో 384 మందికి టీటీఐ అధికారులు అవగాహన కల్పించారు. లెక్చర్ హాల్‌లో చిన్నారుల కోసం నిబంధనల యానిమేషన్ వీడియోలు రైమ్స్ ప్రదర్శించారు. పార్కులో పిల్లలు సైనేజీ బోర్డులను చూస్తూ ఉల్లాసంగా గడిపారు. ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పార్కులో రోడ్డు సూచికలనూ, బైక్ రైడింగ్ జాగ్రత్తలను, నమూనా సిగ్నల్స్ చూపుతూ నిబంధనలను వివరించారు. విద్యార్థులకు కార్టూన్లతో తెలుగు, ఇంగ్లిష్ సూచనలున్న ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్, కరపత్రాలు పంపిణీ చేశారు. 10 ప్రాంతాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై 14 కార్యక్రమాలు నిర్వహించారు.


కావేటి శ్రీకాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ

బీసీలను మోసం చేస్తున్న పార్టీలు : బీసీ రమణ

సైదాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్న ప్రభుత్వంతో కలిసి అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని జాతీయ బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ అన్నారు. శుక్రవారం సైదాబాద్‌లో జాతీయ బీసీ చైతన్య సమితి గ్రేటర్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కావేటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పున్నోజు రామకృష్ణచారి, కోశాధికారిగా తన్నీరు గంగయ్యలకు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి కావేటి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు గిరి యాదవ్, నేతలు అల్లి శ్రవణ్ కువర్, జయ్‌రాజ్ యాదవ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


తాజా మాజీ సర్పంచ్‌ల బకాయిలు చెల్లించాలని పంచాయతీరాజ్ డీసీకి వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ సభ్యులు

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించండి

మన్సూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాజా మాజీ సర్పంచ్‌ల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌ను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ, మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బకాయి బిల్లులు నేటికీ చెల్లించకపోవడంతో తెచ్చిన అప్పులు కట్టలేక చాలా మంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, ఇప్పటికే కొందరు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, ప్రధానకార్యదర్శి రాంపాక నాగయ్య, సముద్రాల రమేష్, నడికూడ రవీంద్రరావు, తదితరులు ఉన్నారు.

'గ్రేటర్‌లో గ్రామీణ ప్రాంతాల విలీనం అవివేకం'

సరూర్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరం చుట్టూ 60 శాతం గ్రామీణ వాతావరణంతో ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్‌లో విలీనం చేయాలనుకోవడం అవివేక నిర్ణయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఏ ప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో కలపాలనుకుంటున్నారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రేటర్‌లో ఇప్పటికే నిధుల కొరతతో అభివృద్ధి అడుగంటిపోయిందని, అందుకే ప్రభుత్వం శివారు పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్‌లో కలిపి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రేటర్ ప్రాంతాలకు మళ్లించాలని కుట్ర పన్నుతున్నదని అందెల ఆరోపించారు. తమ పార్టీ దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతుందని శ్రీరాములుయాదవ్ స్పష్టం చేశారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

హయత్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కమ్మగూడ 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇంజాపూర్ సబ్‌స్టేషన్ ఏఈ రాములు తెలిపారు. కమ్మగూడ ఈస్ట్ సూరజ్‌నగర్, సంపద హోమ్స్, న్యూ సుభాష్‌నగర్, గణేష్ నగర్, రాజ్‌రంజిత్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఏపీఎట్ కాలనీ, జార్జ్ వెంచర్, వెంకటేశ్వరకాలనీ, అన్నపూర్ణకాలనీ, వీరమణి బిస్కెట్‌లలో సరఫరా ఉండదని తెలిపారు.

మునగనూరు ఫీడర్...

మరమ్మతుల కారణంగా యాదాద్రినగర్, రామాంజనేయనగర్, మునగనూరు గ్రామం, మానస టౌన్ షిప్, అంజనాపురి, బ్యాంక్ కాలనీ, వడ్డెర బస్తీ, ద్వారకానగర్, టెలిఫోన్‌కాలనీ, ప్రగతినగర్ కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.